సాక్షి
కుమురంభీం
గురువారం । 12 । అక్టోబర్ । 2023



మహిళలపై క్యాన్సర్ పంజా!
మహిళలపై క్యాన్సర్ భూతం పంజా విసురుతోంది. మహిళా ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో కేసులు వెలుగులోకి వస్తున్నాయి. 10లో▸



రోడ్లపైనే పశువులు..!
కెరమెరిలో రోడ్లపైనే పశువులు సంచరిస్తున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్సుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.7/23.3

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. ఎండవేడి ఎక్కువగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

అడ్డదారులకు చెక్



చింతలమానెపల్లి మండలం గూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించడంతో పోలీస్‌శాఖ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. గతంతో పోలిస్తే ఈసారి ఎన్నికలు హోరాహోరీగా సాగుతాయనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు చేపట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

- జిల్లా సరిహద్దుల్లో పటిష్ట భద్రత
- అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల ఏర్పాటు
- మంగళవారం నుంచి ప్రారంభమైన తనిఖీలు
- ఎన్నికల వేళ అప్రమత్తమైన పోలీస్‌శాఖ
- మద్యం, డబ్బు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

కౌటాల(సిర్పూర్): కుమురంభీం జిల్లాకు ఓ వైపు మహారాష్ట్ర సరిహద్దుగా ఉంది. మరో వైపు ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉంటుంది. గతంలో సిర్పూర్‌లో మవోయిస్టుల దాడులతో ఎన్నికలు నిలిపివేసిన సందర్భాలూ ఉన్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సిర్పూర్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పాల్వాయి పురుషోత్తంను కాగజ్‌నగర్ పట్టణంలోని తన కార్యాలయంలోనే మవోయిస్టులు కాల్చి చంపిన ఘటన అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించింది. జిల్లాలో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగిన సంఘటనలు సైతం అనేకం ఉన్నాయి. అడపాదడపా మవోయిస్టు సానుభూతిపరులంటూ పోలీసులు కొందరిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈసారి ఎన్నికల వేళ ఎలాంటి అలజడులు లేకుండా పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలకు దిగింది. అన్నిశాఖలను సమన్వయం చేసుకుంటూ ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం నుంచి అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ప్రారంభించారు. దీనికి తోడు అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించాలని మావోయిస్టు రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

చెక్‌పోస్టులు ప్రారంభం
కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో సోమవారం నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న నోటిఫికేషన్ జారీ అవుతుండగా, అదే నెల 30న పోలింగ్ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,47,634 మంది ఓటర్లు ఉండగా 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 74 సమస్యాత్మక కేంద్రాలు, 46 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాంకిడి, సిర్పూర్(టి)లోని హుడ్కిలి, వెంకటాపూర్, చింతలమానెపల్లి మండలంలోని గూడెం వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, రెబ్బెన, తాండూర్ మధ్య, దహెగాంలోని కల్వాడ, జైనూర్‌లో అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా వాహనాల రాకపోకలపై నిఘా ఉంచి విస్తృత తనిఖీలు చేపడుతున్నారు.



రెబ్బెనలో అంతర్ జిల్లా చెక్‌పోస్టు

ఖరీదైన ఎన్నికలు..!
పార్లమెంట్, అసెంబ్లీ, సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్.. ఇలా ప్రతీ ఎలక్షన్ ఖరీదైపోయింది. అసెంబ్లీ ఎన్నికలు వీటికి మినహాయింపు ఏమీ కాదు. డబ్బులు పంచడం ఏ స్థాయికి చేరిందంటే.. 'మాకు నోట్లు అందలేదంటూ..' కొంతమంది ఓటర్లు బహిరంగంగానే రోడ్లపైకి వచ్చి మరీ ఆందోళనకు దిగే వరకు వెళ్లింది. రాష్ట్రంలో జరిగే ఎన్నికలు ఈసారి మరింత ఖరీదైనవిగా చరిత్రలో నిలుస్తాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇందులో భాగంగానే కాస్ట్లీ ఎన్నికలు జరిగే ప్రాంతాలను పోలీస్‌శాఖ, ఎన్నికల అధికారులు ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. రాష్ట్రంలో టాప్ టెన్ కాస్ట్లీ ఎన్నిక సెగ్మెంట్లను గుర్తించగా.. అందులో ఆశ్చర్యకరంగా సిర్పూర్ నియోజకవర్గం సైతం ఉండడం గమనార్హం. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుంచే బరిలో ఉండడంతో ఎన్నికలు రసవత్తరం కానున్నాయి.

ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్

- ఎస్పీ సురేశ్‌కుమార్
- కల్వాడ, సోమిని చెక్‌పోస్టులు తనిఖీ



కల్వాడలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

దహెగాం/బెజ్జూర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. దహెగాం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌తోపాటు కల్వాడ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందికి కీలక సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీ సుశాఖ సన్నద్ధంగా ఉందని, సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. మావోయిస్టుల అసాంఘిక కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల సభలు, సమావేశాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఓటర్లను డబ్బు, మద్యం, గిఫ్టులు, మత్తు పదార్థాలు వంటి ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బెజ్జూర్ మండలంలోని సోమిని చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ నాగరాజు, ఎస్సైలు సనత్‌కుమార్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదేశించారు. వాంకిడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తనిఖీల సమయంలో వీడియో సర్వేలెన్స్ టీం అధికారులు వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు.

పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి



ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

జైనూర్(ఆసిఫాబాద్): రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అబుతాలిబ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాలికలకు హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న యువరాజు

ఆసిఫాబాద్‌రూరల్: బాలికలకు తమ హక్కులపై అవగాహన ఉండాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి యువరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులకు బాధ్యతలు, హక్కులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం తరగతి గదులు, వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ జయరాజ్, సిబ్బంది అంజనీదేవి, ప్రిన్సిపాల్ అనిత తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న 104 సిబ్బంది

ఆసిఫాబాద్: 104 సిబ్బంది సమ్మె విరమించారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో తుకారాంకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించామని తెలిపారు. సమ్మెలో పాల్గొన్న 104 సిబ్బంది, టీహబ్ సిబ్బందితోపాటు వైద్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రమేశ్, రవి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక




ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ వివరాలు వెల్లడించారు. ఫస్టియర్ విద్యార్థినులు చౌదరి వైష్ణవి, అడె గాయత్రి ఈ నెల 17న సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే గత నెలలో పూణెలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్- 17 సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో రజత పతకం సాధించిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి ఒర్సుల పూజితను సన్మానించారు. కార్యక్రమంలో పీడీ తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తు గడువు పొడిగింపు

ఆసిఫాబాద్: ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత కోసం నిర్వహించే పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగించినట్లు డీఈవో అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు https:// bse.telangana.gov.in ను సందర్శించాలని కోరారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



పూదరి సాయి



బాలునాయక్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నూతన కమిటీని బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గం రవీందర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బాలునాయక్, ఉపాధ్యక్షుడిగా పర్వతి సాయి, జిల్లా కార్యదర్శిగా పూదరి సాయి, కోశాధికారిగా జాడి సాయిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న వారిని శాలువాలతో సన్మానించారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ఎన్నికల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ నెల 9 నుంచి డిసెంబర్ 5 వరకు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, ర్యాండమైజేషన్‌ను ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనే అధికారుల పనిసామర్థ్యం పెంపుదల, శిక్షణ, వేదికల ఏర్పాట్లు, సామగ్రి పంపిణీ, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. సామగ్రి నిర్వహణ, రవాణా నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. మీడియాతో సమాచార మార్పిడి, రోజువారీ నివేదికల నిర్వహణ, పెయిడ్ న్యూస్‌ల మీద కేసుల సమీక్ష, సోషల్ మీడియాపై పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా కమ్యూనికేషన్ కార్యాచరణ సిద్ధం చేసి భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం, పోలింగ్ పర్యవేక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ ఏర్పాట్లు, దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎలక్టరోల్ నిర్వహణలో భాగంగా ఓటరు జాబితా సవరణ, ఎపిక్‌కార్డుల తయారీ, ముద్రణ, పంపిణీ ఉంటుందన్నారు. ఫిర్యాదుల పరిష్కారం, ఓటర్ హెల్ప్‌లైన్ నిర్వహణలో భాగంగా నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు.

బాలికలు లక్ష్యంతో చదవాలి

- జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి
- కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ఆసిఫాబాద్: బాలికలు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందడుగు వేయాలన్నారు. బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన వారు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ శారద, సీడీపీవోలు సురేఖ, విజయలక్ష్మి, జీసీడీవో శకుంతల, మహేశ్, పుష్పలత, రాణి, మమత, సాగర్, స్టూడెంట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి

వికటిస్తున్న వైద్యం!



సిర్పూర్(టి) మండలం భూపాలపట్నంలో నివాసం ఉంటున్న బూరం చిన్నమల్లు యాదవ్‌కు గత మంగళవారం స్వల్ప జ్వరం రావడంతో మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌కు వెళ్లాడు. అక్కడ ఆర్‌ఎంపీ కుటుంబ సభ్యుడు ఒకరు జ్వరం తగ్గడానికి ఇంజక్షన్ వేయగా శరీరమంతా దద్దుర్లు ఏర్పడి, వాంతులు, చలితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆర్‌ఎంపీ మరో ఇంజక్షన్ వేసినా పరిస్థితి మారలేదు. స్నేహితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించే ప్రయత్నం చేశారు. కానీ పరిస్థితి మరింత విషమించింది. చివరకు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించి మృతి చెందాడని అక్కడి వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఇదంతా కేవలం ఐదు నుంచి ఏడు గంటల్లోనే జరిగింది.

- జిల్లాలో కొంతమంది ఆర్‌ఎంపీల తీరుతో ప్రజలకు నష్టం
- ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు దాటి చికిత్స
- విచ్చలవిడిగా మెడిసిన్ వినియోగం
- దృష్టి సారించని వైద్యారోగ్య శాఖ

చింతలమానెపల్లి(సిర్పూర్): పౌరసేవగా ఉన్న వైద్యం ప్రభుత్వం నుంచి ప్రైవేటుకు మారింది. ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు పుట్టుకొచ్చాయి. క్లినికల్ ల్యాబ్‌లు, ఆర్‌ఎంపీల ప్రాథమిక చికిత్స కేంద్రాలు గల్లీగల్లీలో వెలిశాయి. రోగులను తరలించి సొమ్ము చేసుకునేందుకు గ్రామాల్లోనూ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసుకుని మరీ వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారు. అయితే కొంతమంది ఆర్‌ఎంపీలు నిబంధనలకు మించి చేస్తున్న వైద్యం వికటిస్తోంది.

నిబంధనల ఉల్లంఘన
ఆర్‌ఎంపీలు నిబంధనల మేరకు రోగిని పరిశీలించి తగిన సూచనలు అందించాల్సి ఉంటుంది. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వైద్యుడి వద్దకు వెళ్లే విధంగా సూచించాలి. రోగికి చికిత్స అందించడంలో రక్షణాత్మకంగా వ్యవహరించాలి. మత్తు మందులు, సూది మందులు, గాయాలను కోయడం, చీరడం వంటివి నిర్వహించొద్దు. అయితే ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి కొంతమంది ఆర్‌ఎంపీలు వైద్యం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుభవం లేని వైద్యంతో కిడ్నీలు వైఫల్యం చెందడానికి ఇతర దీర్ఘకాలిక రోగాలకు కారణమవుతున్నారు. లాభాపేక్షతో తెలంగాణలో నిషేధం ఉన్న, అనుమతి లేని నాసిరకం మందులను మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చి రోగులకు అందిస్తున్నారు. ఈ మందుల దుష్ప్రభావాలతో కొత్తరోగాలు వస్తున్నాయి. అరుదుగా వినియోగించాల్సిన యాంటీబయోటిక్ మందులను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇలా విచ్చలవిడి మందుల వినియోగంతో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారు. ఎండీ చదువుకున్న వైద్యుల పర్యవేక్షణలో వినియోగించాల్సిన మందులను నేరుగా రోగులకు అందిస్తున్నారు. క్లినిక్‌ల్లోనే మెడికల్ దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చింతలమానెపల్లి మండలంలోని డబ్బా, మండల కేంద్రాల్లో అబార్షన్‌లు చేసి పిండాలను చెత్తకుప్పల్లో పడవేయడం ఆర్‌ఎంపీల పనేనని స్థానికంగా అనుమానాలు వ్యక్తం అయ్యాయి. రవీంద్రనగర్, చింతలమానెపల్లిలో నర్సింగ్‌హోమ్‌లను తలపించేలా అనుమతి లేకుండా చికిత్స అందిస్తుండడం గమనార్హం. వైద్యం వికటించి రోగులు మృతి చెందుతున్న ఘటనలు తరచూ నమోదవుతున్నాయి. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి ఘటనను తీవ్రతరం కాకుండా స్థానిక నాయకులు వ్యవహరిస్తున్నారు. ఆర్‌ఎంపీల వైద్యాన్ని జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆర్‌ఎంపీల వైద్యం..
వైద్యం.. ఇది నేటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఈ పరిస్థితుల్లో వైద్యంపై అవగాహన ఉన్నవారిని పరోక్షంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. వైద్యుల వద్ద పనిచేసి అనుభవం ఉన్న వారికి రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లుగా, పారా మెడికల్ ప్రాక్టీషనర్లుగా గతంలో ప్రభుత్వాలు సర్టిఫికెట్లు సైతం అందించాయి. కలరా, డయేరియా లాంటి వ్యాధులు తీవ్రంగా ప్రబలిన సమయంలో వీరి సేవలను ప్రభుత్వాలు వినియోగించుకున్నాయి. నిబంధనలు రూపొందించి పరిమితి మేరకు వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నాయి. గ్రామాల్లో వీరు అందించిన సేవలు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయి.



గాడి తప్పిన వైనం
కార్పొరేట్ ఆస్పత్రులకు రోగులను తరలించడానికి కొందరు ఆర్‌ఎంపీలు వనరులుగా మారారు. లాభాపేక్షతో వారు వైద్యాన్ని వ్యాపారంగా భావించడం మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా 500కు పైగా ఆర్‌ఎంపీలు ఉన్నారని ఆర్‌ఎంపీల సంఘాలు తెలియజేస్తున్నాయి. కుమురంభీం జిల్లా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉంది. సరిహద్దు మండలాలు వాంకిడి, సిర్పూర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాంలకు మహారాష్ట్ర నుంచి వచ్చిన వారు ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతున్నారు. అంతేకాక వీరు ఏకంగా అబార్షన్‌లు నిర్వహించడం, కోవిడ్ లాంటి వ్యాధులకు చికిత్స అందిస్తామంటూ ప్రచారం చేసుకోవడం గమనార్హం. చింతలమానెపల్లి మండల కేంద్రంలో ఒక ఆర్‌ఎంపీ ప్లేట్‌లెట్ల సంఖ్య 4వేలకు తగ్గినా చికిత్స అందిస్తానని ప్రచారం చేసుకోవడం పరిస్థితిని తెలియజేస్తోంది.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించొద్దు. రోగిని ఒక రోజుకు మించి తమ వద్ద ఉంచుకుని వైద్యం అందించొద్దు. పరిస్థితి తీవ్రంగా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించాలి. నిబంధనలు పాటించని వారిపై ఆర్‌ఎంపీ సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు చేస్తాం. – అజయ్‌కుమార్, ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫిర్యాదు చేయండి

ఆర్‌ఎంపీల వైద్యంపై సమీక్ష నిర్వహిస్తాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తాం. ఆర్‌ఎంపీల సంఘాల సహకారంతో ప్రజలకు అన్యాయం జరగకుండా చర్యలు చేపడతాం. ఆర్‌ఎంపీల కారణంగా ఎవరైనా నష్టపోయినా, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వైద్యం చేసే వారిపై నేరుగా వైద్యశాఖకు ఫిర్యాదు చేయండి. – తుకారాం, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

12మంది పాతనేరస్తుల బైండోవర్

దండేపల్లి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ కేసుల్లో పాత నేరస్తులైన 12మందిని తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో పాత నేరస్తుల వివరాలు సేకరించి వారిని బైండోవర్ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రైన్ కిందపడి ఒకరి ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రిలోని విద్యానగర్‌కు చెందిన మోతె బాపు(50) రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబల్ సురేష్‌గౌడ్ వివరాల ప్రకారం... కూలీపని చేసుకునే మోతె బాపు కొంత కాలంగా తాగుడుకు బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు తాగుడు మానేయమని ఎంత చెప్పినా వినకుండా పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే గుర్తు తెలియని ట్రైన్‌కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు.

పటిక, బెల్లం పట్టివేత



పట్టుకున్న బెల్లం, పటిక

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన కిరాణ వ్యాపారి లచ్చన్న ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 2క్వింటాళ్ల బెల్లం, 2క్వింటాళ్ల పటికను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పట్టుకున్న బెల్లం, పటికను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నలుగురి బైండోవర్

మంచిర్యాలక్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నలుగురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థానిక లక్ష్మీ థియేటర్ సమీపంలో భూమిపూజ చేసేందుకు యత్నించగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కర్నకంటి రవీందర్, రామగిరి శ్రీనివాస్, ఆంద్రాస్ యుగెందర్, గుండ సదానందంలను అరెస్ట్ చేసి స్థానిక తహసీల్దార్ కేవై ప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పదని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు..

తనిఖీల్లో పట్టుబడ్డ గంజాయి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల్లో భాగంగా పోలీసులు తనిఖీలు చేస్తుండగా గంజాయి పట్టుబడింది. బుధవారం పోలీసులు ఆర్కే 5 గని వద్ద తనిఖీలు చేస్తుండగా సంజీవ్‌రామ్ అనే వ్యక్తి వద్ద 120 గ్రాముల గంజాయిని గుర్తించారు. సంజీవ్‌రామ్ గంజాయిని మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి తీసుకువచ్చి అమ్మడానికి ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్లు సీజ్

జైనూర్: మండలంలోని జంగాం ఎన్నికల చెక్ పోస్టు వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షల మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు మండల అధికారులు ప్రభుదయ, వాగ్మారే సుధాకర్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న తరుణంలో కారులో పత్రాలు లేకుండా మొబైల్ ఫోన్‌లను తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని జైనూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళలపై క్యాన్సర్ పంజా..!



మహిళలపై క్యాన్సర్ భూతం పంజా విసురుస్తోంది. ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో క్యాన్సర్ కేసులు బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయం, ఇంటిపనులు, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో తమవంతు పాత్ర పోషిస్తూ మహిళలు తమ ఆరోగ్య పరీక్షలు వాయిదా వేయడం సర్వసాధారణమైంది. ఈ నేపథ్యంలో ప్రతీ మహిళకు వైద్య పరీక్షలు అందాలనే ఉద్దేశంతో ఈ ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలు ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. వ్యాధులను గుర్తించి అవసరం మేరకు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్ గుర్తించిన వారిని హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎంఎన్‌జే ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు మంచిర్యాల జిల్లాకు చెందిన ఓరల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న పది మందిని, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు ఉన్న 35మందిని, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఉన్న 15మందిని రెఫర్ చేశారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



మంచిర్యాలలోని పాలియేటివ్ కేర్ సెంటర్

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో పరీక్షలు

పెరుగుతున్న కేసుల సంఖ్య

ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు మహిళలు వివిధ రకాల క్యాన్సర్ బారినపడ్డారు. ఓరల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడ్డట్లు గుర్తించారు. ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో బాధితుల సంఖ్య తెలుస్తుండగా.. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరీక్షలు, చికిత్స చేయించుకునే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.

పాలియేటివ్ కేర్ సెంటర్లలో చికిత్స

మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పాలియేటివ్ కేర్ సెంటర్లు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 2002 ఫిబ్రవరి 8న పాలియేటివ్ కేర్ సెంటర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. క్యాన్సర్‌తోపాటు నాన్ క్యాన్సర్‌కు సంబంధించిన క్రానిక్ బెడ్ రిడేన్ అంటే పూర్తిగా మంచానికే పరిమితమైన వారు, కిడ్నీ ఫెయిల్యూర్, పక్షవాతం, క్రానిక్ డయాబెటిక్, ఫిజియోథెరపీ అవసరమైన వారి కోసమని ఎనిమిది బెడ్లతో ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకు క్యాన్సర్‌కు సంబంధించిన 430 మంది, నాన్ క్యాన్సర్‌కు సంబంధించి 1500మందికి చికిత్స అందించారు. అన్ని జిల్లాల్లో త్వరలో కీమో థెరపీ ప్రారంభిస్తామని, మొదటగా ప్రయోగాత్మకంగా ఎనిమిది జిల్లాల్లో ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇటీవల ప్రకటించారు. కీమో థెరపీ అందుబాటులోకి వస్తే రోగులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది.

పౌష్టికాహారం తీసుకోవాలి



క్యాన్సర్ బారిన పడే వారిలో ఎక్కువ మంది ధూమపానం, మద్యపానం, పొగాకు సంబంధిత వాటిని వినియోగిస్తున్న వారే ఎక్కువగా ఉంటారు. సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా రోగ నిరోధక శక్తి పెంపొందే అవకాశం ఉంటుంది. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సరైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధులకు దూరమయ్యే అవకాశం ఉంది. – డాక్టర్ శ్రీనివాస్, పాలియేటివ్ కేర్ వైద్యుడు, మంచిర్యాల

జిల్లాల వారీగా పరిశీలిస్తే..

పరీక్షలు	మంచిర్యాల	నిర్మల్	ఆదిలాబాద్	కుమురంభీం
ఓరల్ క్యాన్సర్ టెస్టులు చేసింది:	6,427	13	3,333	2308
ఓరల్ క్యాన్సర్ అనుమానితులు:	29	13	1	0
రొమ్ము క్యాన్సర్ టెస్టులు చేసింది:	6,480	41	3,313	1857
కొత్తగా రొమ్ము క్యాన్సర్ గుర్తించింది:	7	41	0	5
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టెస్టులు:	1,733	189	1,446	484
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నమోదు:	4	33	24	0

నాయకులు సైనికుల్లా పని చేయాలి

జన్నారం: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు గ్రూపులను విడిచి సైనికుల్లా పని చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మబొజ్జు పేర్కొన్నారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అనుకూలంగా ఉన్నారని, అధిష్టానం చేసిన గ్యారంటీ స్కీంలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో గడపగడకూ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, చేసిన అప్పులు, తప్పిన హామీలను వివరించాలని కోరారు.సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, జిల్లా, మండల నాయకుల సుభాష్‌రెడ్డి, రాజశేఖర్, శంకరయ్య, రమేశ్, ఇందయ్య, లక్ష్మణ్, రాకేశ్, ముజ్జు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జు

ఎమ్మెల్యే చిన్నయ్యకు ప్రచార రథం..



ప్రచార రథం ఎదుట ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు ఓ అభిమాని ప్రచార రథాన్ని కానుకగా అందజేశాడు. బుధవారం క్యాంపు కార్యాలయం ఆవరణలో బెల్లంపల్లికి చెందిన వ్యాపారవేత్త సందీప్ యాదవ్ అంబాసిడర్ కారుతో తయారు చేయించిన ప్రచార రథాన్ని బహుమతిగా అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభిమానంతో ప్రచార రథాన్ని తయారు చేసి అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

శ్రీరాంపూర్: తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సాక్షర భారత్ వీసీఓలు కోరారు. బుధవారం కృష్ణాకాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో వీసీవోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో 18 వేల మంది సాక్షర భారత్ వీసీవోలు పని చేస్తుండగా ప్రభుత్వం తమను అర్ధాంతరంగా తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయన్నారు. వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు పోశం తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఓపెన్‌స్కూల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 16 నుంచి 26 వరకు ఓపెన్‌స్కూల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు.. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సాయికుంటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కస్టోడియల్ డెత్‌పై 13న విచారణ

మంచిర్యాలఅగ్రికల్చర్: గత నెలలో బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందిన కీర్తి అంజి కస్టోడియల్ డెత్‌పై ఈ నెల 13న ఉదయం 11గంటలకు మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో న్యాయాధికారి విచారణ నిర్వహించనున్నట్లు మంచిర్యాల ఆర్డీవో రాములు ఒక ప్రకటలో బుధవారం తెలిపారు. సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



శరణ్య మృతదేహం

నస్పూర్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం... ఇప్ప శరణ్య (30), భర్త రవీందర్‌కు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన శరణ్య బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శరణ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి పుష్పవతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీ

రెబ్బెన: వాహనాల తనిఖీల్లో భాగంగా అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ఎలాంటి ధృవపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1,62,000లను సీఐ నరేందర్ సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై చంద్రశేఖర్, ఎంపీవో అమ్జాద్ ఉన్నారు.

బీఎస్‌డీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మధుకర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న మధుకర్

మంచిర్యాలక్రైం: బహుజన సమాజ్ డెవలప్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన పొట్ట మధుకర్‌ను నియమిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చింతాడ సూర్యం నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మధుకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టి వారి గెలుపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఖాజ, జాతీయ ప్రధాన కార్యదర్శి యామిని లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల బెల్లంపల్లిలో జోనల్ లెవల్ (ఉమ్మడి ఆదిలాబాద్) అండర్-19 ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి టి.వైష్ణవి, శ్రావణి, హిమమత్య, అఖిల రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 17న సదాశివ్‌పేట్ సంగారెడ్డిలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ రజిని, ఉపాధ్యాయులుఅభినందించారు.

నేడు వాలీబాల్ పోటీలు...

స్కూల్ గేమ్స్ ఫెడరేస్ జిల్లా వాలీబాల్ అండర్ 14, 17 బాలబాలికల సెలక్షన్ పోటీలు ఈ నెల 12న చెన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమళ అన్నారు. ప్రతి పాఠశాల నుంచి నలుగురేసి చొప్పున బాలబాలికలు పోటీలో పాల్గొనవచ్చన్నారు. బోనఫైడ్, ఆధార్‌కార్డు తదితర ధృవీకరణ పత్రాలతో హాజరు కానున్నారు.

గుడుంబా స్వాధీనం

మంచిర్యాలక్రైం: గుడుంబా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక ఆండాలమ్మ కాలనీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మందమర్రి మండలం పులిమడుగుకు చెందిన బానోత్ క్రాంతికుమార్, ధరావత్ సాగర్ పాత మంచిర్యాలకు ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.3వేల విలువ గల 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

ప్రైవేటీకరణ మానుకోవాలి

- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి



ఉద్యోగులతో మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

శ్రీరాంపూర్: కాలనీలలో వీధి లైట్ల మెయింటనెన్స్ పనులను ప్రైవేటు పరం చేయడం మానుకోవాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో ఈ పనుల నిమిత్తం ఇటీవల కొంత మంది ప్రైవేటు సిబ్బందిని తీసుకున్నారు. బుధవారం ఆయన యూనియన్ నాయకులతో కలిసి వర్క్‌షాప్‌కు వెళ్లి వారిని పనులకు పురమాయించకుండా అడ్డుకున్నారు. అనంతరం వర్క్‌షాప్ డీజీఎం మల్లయ్యతో మాట్లాడారు. పర్మినెంట్ కార్మికులు పని చేయాల్సిన చోట ప్రైవేటు కాంట్రాక్టు వ్యక్తులను పెట్టుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విధానం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా చర్చల ప్రతినిధి వెంగళ కుమారస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తొంగల రమేష్, బ్రాంచ్ కార్యదర్శి బ్రహ్మచారి, ఫిట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, నాయకులు ఒల్లాల రవి, దుర్గయ్య, మహేష్ పాల్గొన్నారు.

డీఆర్‌డీవో సైంటిస్ట్‌గా మేనేజర్ కుమారుడి ఎంపిక



సంజయ్‌ను అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్‌లోని దుండిగల్‌లోని డీఆర్‌డీవోలో యంగ్ సైంటిస్ట్‌గా ఎంపికైన శ్రీరాంపూర్‌కు చెందిన సంజయ్‌ను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అభినందించారు. ఆర్కే 7 గని మేనేజర్ సాయి ప్రసాద్ కుమారుడైన సంజయ్ గేట్ పరీక్ష ద్వారా ఈ ఉద్యోగాన్ని సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం జీఎం సంజయ్‌ని అభినందించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన సంస్థలో సింగరేణి బిడ్డకు ఉద్యోగం రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కే వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విజేతగా బీపీఏ మందమర్రి జట్టు



విజేతగా నిలిచిన బెల్లంపల్లి, మందమర్రి జట్టు క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా మణుగూరులో నిర్వహిస్తున్న కంపెనీ లెవల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి జట్టు విన్నర్‌గా నిలిచింది. బుధవారం ఆర్జీ-3, భూపాలపల్లి జట్టుతో జరిగిన ఫైనల్ పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి జట్టు హోరాహోరీగా తలపడింది. చివరకు బెల్లంపల్లి, మందమర్రి జట్టు 31-35, 35-29, 35-26 పాయింట్ల ఆధిక్యంతో ఆర్జీ-3, భూపాలపల్లి జట్టుపై విజేతగా నిలిచింది. కంపెనీ స్థాయి పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి జట్టు క్రీడాకారులు అద్భుత ఆట తీరును ప్రదర్శించి విజేతగా నిలువడంతో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ క్రీడాకారులను అభినందించారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్

పాతమంచిర్యాల: క్రైస్తవులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం ఉంటుందని క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బెతెస్త ప్రార్థన మందిరంలో క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తుందని వివరించారు. రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐపీఎంఆర్ జిల్లా అధ్యక్షుడు ఐజయ్య, కార్యదర్శి సామ్యేల్ కోశాధికారి జానియా పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

నెన్నెల: మండలంలోని బొప్పారం గ్రామ శివారులో 2018 జూలై 5 భూవివాదంలో ఒకరిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఒకరికి మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్ జడ్జి అర్పిత మారంరెడ్డి బుధవారం తీర్పునిచ్చారు. కోర్టు లైసన్ అధికారి గులాం దస్తగిర్, స్థానిక ఎస్సై శ్యాంపటేల్ వివరాల ప్రకారం... 2018లో బొప్పారం గ్రామానికి చెందిన దంపతులు కర్నకొండ చంద్రశేఖర్ పద్మలను భూ వివాదంలో కర్నకొండ శ్రీనివాస్ ఇతడి భార్య ఉమరాణి కత్తులతో, గొడ్డళ్లతో దాడిచేసి హత్య చేసేందుకు యత్నించారు. వారు పారిపోయి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో నిందితులకు హాజరు పరిచి నేరం రుజువు చేయడంతో శ్రీనివాస్‌కు మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా, శ్రీనివాస్ భార్య ఉమరాణికి రూ.1000 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న టీమ్ సభ్యుడు అనిష్

మంచిర్యాలక్రైం: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఇగ్నైట్, ఇన్‌స్పైర్ సభ్యులు సంపత్, అనిష్ అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి ధశ ఎంతో ఉన్నతమైనదన్నారు. డిగ్రీ తర్వాత స్థిరపడే విధంగా లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.శివలీల, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిల్ సదయ్య

మంచిర్యాలఅర్బన్: అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. బాలిక వివాహాలు నిరోధించటానికి విద్యార్థినిలందరూ ముందుడేలా కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట లీగల్ ఎయిడ్ డిఫెన్స కౌన్సిల్ సదయ్య, న్యాయవాది గురవయ్య, పాఠశాల ప్రత్యేకాధికారిణి స్వప్న, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బాలికల జట్టు ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

బెల్లంపల్లి: రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టును ఎంపిక చేశారు. బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-19 విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 12మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, పీఈటీ రాధారాణి, పీడీలు సుధీప్, తిరుపతి, మమత పాల్గొన్నారు.